



# అంతర్ముఖం


జాతశ్రీ


ఇం కా తెల్లవారలేదు. మంచు దట్టంగా కురుస్తోంది. ముందు వసారాలో కట్టేసి ఉన్న గేదెపాలు పితికిన భూదేవమ్మ ఇంట్లోకి వస్తూ, తాళ్లు గీయడానికి తయారవుతున్న భర్తను చూస్తూ, "కాస్తాగు, టీ పెడత... తాగి పోదువుగాని," అంటూ పొయ్యి దగ్గరకు పోయింది.

అప్పటికే బిల్లగోచిపై పట్టా బిగించి, ముస్తాదు కట్టుకొన్నాడు మల్లేశం. "జల్ది కానియ్," అంటూ, చిరతబద్ద అందుకొని నులకమంచం మీద కూచొని ముంజ కొడవలిని సానబడుతూ, "ఏవంటున్నడు పెద్దోడు?" అన్నాడు.

"అనేదేముంది... అదే పదం. ఎంత సెప్పినా ఇనుకోవటంలే... ఏ మాట జెప్పినా తిరగ సెపుతుండు. ఒక్కేడు ఓపికపడితే మన కష్టాలన్నీ తీర్తయి అంటున్నడు. సెప్పి సెప్పీ యాష్టకొస్తాంది," అంది భూదేవమ్మ.

"పట్టు, పట్టుమని యాభయ్యేలు ఎవురిస్తరే... నేనేడ సచ్చేది?" అన్నాడు మల్లేశం.

"ఈడికిదేం మాయరోగవోఁ... కుయిటు, కుయిటు అని తగిలిండు. ఇవానం ఎప్పుడెక్కుతనని సూస్తాండేగాని, మరో దేస లేదాడికి," అంది భూదేవమ్మ.

"ఏం ఇవానవోఁ... ఏవోఁ... ముందు నన్ను పాడెక్కించేలా ఉన్నాడు," సానబట్టిన ముంజ కొడవలిని బొటనవ్రేలితో గీరుతూ, పదును జూసి, దాన్ని ప్రక్కనే ఉంచి, గీసకత్తిని అందుకున్నాడు మల్లేశం.

"గీసకత్తికి రేత్తిరే పదునెట్టినవ్ గాదూ?..." టీ గ్లాసుతో భర్త దగ్గరగా వస్తూ అంది భూదేవమ్మ.

"పట్టినలే తియ్," అంటూ గీసకత్తి పదును జూసి, చిరతబద్ద మీద ఓసారాడించి, పక్కనుంచుతూ, టీ గ్లాసు అందుకొన్నాడు మల్లేశం.

భూదేవమ్మ భర్త కాళ్లముందు నేలమీద కూచొని, మూడురోజుల క్రితం తాటిమట్ట గీరుకొని, పెద్ద పుండయిన చోట కుడి చూపుడువ్రేలితో నెమ్మదిగా నిమురుతూ, "సీవింకా ఉంది, సూదేయించకొన్నవా?" అంది.

"ఆ... ఇరవై దొబ్బిండుగాదూ డాకటరు," అన్నాడు మల్లేశం.

"అదేంది... పదేగాదూ!... నిన్న పొద్దాల ముంజ కొమురన్నకి సూదేసి పదే తీసుకుండుగా... ఎవురికేసినా అదే సూదాయె... మన్సికో రేటా?..." అంది భూదేవమ్మ.

"ఏవోఁ... పోనియ్, పిల్లలున్నోళ్లం. ఎప్పుడు కేకేసినా పరిగెత్తుకొస్తాండు. అయితమాన్లె."

"పున్నేనికొస్తాండా... బరాబర్ పైసలిస్తన్న... నేనడగతా నుండు."

"అడక్కు... ఏ సూదిల ఏ మతలబు ఉందో, మనకేవెఁరక?"

"అంద్కని అడిగినంతిస్తవా?"

"పోనీ అన్నాగా... అరవబాక," అంటూ టీ గ్లాసు అందించి, మంచంలోంచి లేచి చిలక్కొయ్యకున్న కాళ్ల గుదిని తీసుకొని, ఓసారి లాగి చూసి, మూలనున్న కాడిబద్ద అందుకొన్నాడు మల్లేశం.

"మర్సిన, రాత్రి సందేళ... మీ తమ్ముడు కోటేశం ఇంటికొచ్చిండు," అంది భూదేవమ్మ.

"ఏందట?"

''పెద్దపిల్ల- అదే, మాలక్ష్మి సవఁర్తయిందట. ఒకెయ్యి రూపాయలు కావాలన్నడు,'' అంది భూదేవమ్మ.

''నువ్వేవఁన్నవ్?''

''నిన్నడిగి సెపతనన్న... అప్పుడే ఇద్దావని పించింది గానీ, నీకో మాట సెపితే బాగని ఆగిన...''

''ఇస్తే పొయ్యేదిగా... నాకు సెప్పేదేంది? ఇంట్లో ఉండి గుడ్లేవఁన్న పెడతయా?... అయినోడికీ, ఆపదకీ కాక రూపాయలు మూట కడతవా? అన్నా తమ్ముడూ, మంచీ మన్ననా లేక, 'డబ్బో...' అంటూ ఎగ్రెత్తిపోటానికి మనవేఁవన్న ఈ కాలపోళ్లవాఁ'' అన్నాడు మల్లేశం.

''సర్లే... అట్టనే, నేనే పొయ్యి ఆ పిల్దాని చేతిల రెండు కొబ్బరి కుడకలూ, ఇంత బెల్లంబెట్టి, కోటేశానికి డబ్బులిచ్చొస్త,'' అంది భూదేమ్మ.

వసారాలో పందిరి గుంజకు తగిలించి ఉంచిన మోకు అందుకొని, ''సూత్తన్నవేంది, లొట్లు దేపో...'' అన్నాడు మల్లేశం.

''నా మతిమండ... ఏందో, గీ పోరగాడు సెయ్య బట్టి మతిల మతి ఉండటంలే...'' అంటూ, ఇంటి వెనుక నీళ్లగాబు దగ్గరున్న లొట్లు కడిగి, తీసుకొచ్చి అందించింది భూదేవమ్మ.

వాటినందుకొని మల్లేశం, కావిడిబద్దకు తగిలించుకుంటుంటే, భర్త వీపున చెయ్యానిస్తూ, ''జాగర్త, మంచు కురుస్తాంది,'' అంది భూదేవమ్మ.

''నా జాగర్తకేం గాని, ఆ పెద్దోడినే కాస్త అర్సుకో,'' అన్నాడు మల్లేశం.

''అవ్‌గానీ, రాజెన్నేవఁన్నడు?'' అంది భూదేవమ్మ.

''సంక్రాంతెల్లినాక ఏ సంగతి సెపుతనన్నడు. గవర్నమెంటుసుత దివాలెత్తిందంట. పోయినేడు బకాయిలన్నీ కట్టందే కొత్త లోన్లియ్యొద్దని సెంద్రబాబు ఆర్డరేసిండంట,'' అన్నాడు మల్లేశం.

''ఏవాఁయె... పేదోళ్లు బతకొద్దంటనా? అయినా మనం పూరా గట్టినంగాదూ?...'' అంది భూదేవమ్మ.

''మనం గడితె సరిపోద్దా... సొసైటి మెంబర్లంత కట్టొద్దా... అయ్యన్నీ సెక్రటి బేంకుల జమ చెయ్యొద్దా... ఆ లెక్కలన్నీ తేలాక, అప్పుడు మళ్లీ కొత్తప్పులకి అర్జీ పెట్టుకోవఁని సాటింపేస్తరు ఎరుకయిందా?'' అన్నాడు మల్లేశం.

''ప్చ్. ఏందో ఈ శెరలు... ఈ మాయదారి పోరగాడితో మా సిరాగ్గుంది. ముద్ద మింగుడు పడనియ్యటంలే... ఒహటే నస... రెండెకరాలు అమ్ముదావంటడు,'' అంది భూదేవమ్మ.

మల్లేశం ఉలిక్కిపడ్డాడు. నోరు పడిపోయిన వానిలా ఓ క్షణం తేలగుడ్లేసి, భార్యకేసి చూస్తూ, ''ఏందీ... పొలం అమ్ముతడంటనా... అమ్మి ఏం జేస్త డంట?'' అన్నాడు.

''ఏడాది తిరక్కుండానే నాలుగెకరాలు కొంట డంట.''

''మా కొంటడు, వాడి ఏశాలు తెల్వదనుకుంటుండేవో... సదువు రానోళ్లవఁని మా ఆడిస్తండు. అరె, ఈ పోర్గాడు జెయ్యబట్టె గద, ఆ కొత్తగూడెం టీవోడు ఇంటిమీద పడి పరువుదీస్తండు. వాయిదాల సొమ్మొద్దు రాంటే ఇని సచ్చిండా. అది తడిసి మోపెడయింది. అయ్యగారికి టివి లేకుంటే పొద్దుబోదేవోఁ... నెలకు పదేసొందలు యాడ నుంచి దెస్త,'' అన్నాడు మల్లేశం చిరుకోపంతో.

''అయితే మాన్లె తియ్... ఊరంతా తీసుకొం టుంటే ఆడూ కాయిశు పడ్డడు. అప్పుల అప్పు... ఇంకేంది? మూడాయిదాలు కడితే తీరిపోద్ది,'' సముదాయింపుగా అంది భూదేవమ్మ.

''శాన జెప్పినవ్‌లే, ఇగాగు... అరె, అటు పెద్దాని పెళ్లిబాకీ సంగతి జూడల్నా... అదో బిడ్డ తల్లయినా దాని కిస్తనన్న ఇరవయ్యేలూ సర్దలేక సస్తుంటే... వాడికి తెల్వదా? వాడేవఁన్న పాల్దాగుతుండా... ఇగ్గో వాడితో జెప్పు, ఒహటే మాట... కాలం బాగుంటే, కలిసొస్తే పత్తి డబ్బులొచ్చినంక పొమ్మను. ఇప్పుడిప్పుడే కావాలంటే నే కాటికిపోటం తప్ప దారేదీ దొరకటంలే... అరె, తోటోడు తొడ గోసుకొండని మనం మెడ గోసుకొం దావఁ... సదూకున్నోడేవోఁ... ఆ మాత్రం తెల్వదా ఆడికి?...'' అన్నాడు మల్లేశం.

''నే జెపుతలే, నువ్వు గుండె జెదరమాక,'' అంది భూదేవమ్మ.

మల్లేశం లోలోనే మరేదో గొణుక్కొంటూ, కావిడి బద్ద బుజానుంచుకొని, ఓపక్క మోకు తగిలించాడు. వసారాలో ఉన్న చెప్పులేసుకొని, ''పొయొస్త,'' అంటూ ఇల్లు దాటాడు.

వీధి వాకిళ్లల్లో ఊడుస్తో... కళ్లాపి జల్లుతో... ముగ్గులేస్తో... అమ్మలక్కలు పనులు చేసుకుంటు న్నారు. తాళ్ల వనానికి బయల్దేరిన ఐదారుగురు 'గౌడ'లు పాఠశాల ముందు రోడ్డుమీద ఏవో మంతనాలు చేస్తు న్నారు. వాళ్లను చూసేసరికి మల్లేశానికి తాడిశిస్తు కట్టా

ల్సిన విషయం గుర్తొచ్చింది. శిస్తు డబ్బులు తీసి పక్కన బెట్టాడుగాని, నాల్రోజులు నుంచి పెద్దోడి గోలకి ఏదీ గుర్తుండటం లేదు. 'రేపు కడదాంలే తియ్,' అని తనకి తానే చెప్పుకొని ముందుకు సాగాడు.

కొత్త మామ్లు కాగానే తాళ్ల శిస్తు వసూళ్లు మొదలు పెట్టడం చాలామందికి కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. అదే సమయంలో పిల్లల అవసరాలూ నెత్తిన పడతాయి. స్కూల్‌డ్రెస్‌లూ, బస్‌పాస్‌లూ, పుస్తకాలూ... అన్నీ ఒకే సారి సర్దాలంటే, కులవృత్తికి తోడు కాస్త వ్యవసాయం ఉన్నవాళ్ల పరిస్థితి ఫర్వాలేదుగాని, అచ్చంగా కల్లు మీదనే ఖర్చులన్నీ తీరాలంటే కష్టంగానే ఉంటుంది. ఎంత కాదనుకున్నా మూడు నాలుగువేలు అప్పు పడటం తప్పదు. సీజను వచ్చేదాకా వడ్డీ కట్టడమూ తప్పదు.

మల్లేశం కులవృత్తిపైనే ఆధారపడినవాడేం గాదు, పిత్రార్జితం మూడెకరాల మాగాణీ, నాలుగెకరాల నల్ల రేగడి చెలకా ఉంది. కులపోళ్లు అతన్ని ఉన్నోళ్ల సరసనే లెక్కిస్తారు. అయితే గత ఐదారేళ్ల నుంచీ అతనికి వ్యవ సాయంలో కలిసిరావడంలేదు. ఊరి చెరువు అలుగెల్లితే రెండు పంటలకు ఢోకా ఉండదు. ఎంతలేదన్నా డెబ్బయి, ఎనభై బస్తాల వడ్లు ఇంటికి చేరతాయి. ఎరువులూ, పురుగు మందులూ ఇతర ఖర్చులు పోను, అటు ఏడాది తిండిధాన్యమూ, చేతిలో పాతికవేలూ కనపడే పరిస్థితిలోంచి... క్రమంగా కష్టపడీ, నెత్తిన చెంగేసుకొని నీరసంతో ఇంటికి చేరే దుస్థితిలోకి దిగ జారాడు.

తోడుగా ఈమధ్య రైతుల్ని దగాచేసే దళారులు ఎక్కువయ్యారు. గత సంవత్సరం పదహారు క్వింటాళ్ల పత్తి గుంటూరు మిల్లుకెత్తితే, వాడు తిరిగొచ్చిందీ లేదు, పత్తి డబ్బులిచ్చిందీ లేదు. అదేమని నలుగురైదుగురు కలిసి అడిగేందుకు పోతే వచ్చిన రశీదులు దొంగవని బెదరగొట్టారు. పోలీసు కేసు పెట్టడం జరిగింది, గాని కొన్న మనిషే కనిపించటంలేదు.

రోజుల్ని చూస్తుంటే మల్లేశానికి అయోమయంగా ఉంది. ఎందుకు, ఎలా జరుగుతుందో అతనికి తెలిసి రావడం లేదుగాని, రోజురోజుకీ ఖర్చులు బాగా పెరిగి పోతున్నాయి. అదే తిండి, అదే బట్ట, అదే పూరిల్లు, కొత్తగా ఒరిగొచ్చిందేమీ లేకున్నా, సంపాదనంతా లెక్కకు దొరక్కుండానే పోతోంది. పది రూపాయలు వెనకేద్దా మంటే వల్లగావడంలేదు. ఎరువుల కొట్లో, బట్టలకొట్లో అప్పులు అలానే ఉన్నాయి. ప్రతి ఉగాదికీ అప్పులన్నీ తీర్చేసి, కొత్త ఖాతా రాయించుకునే మల్లేశం, రెండేళ్ల నుంచీ పాత అప్పుకే వడ్డీ కలిపి, కొత్త ఖాతా తెరవడం బాధగా ఉంది. ఐటిఐ చదివిన పెద్దోడు రికంగా తిరగడం అతనికి తలనొప్పిగా ఉంది. తెలివిన బతుకు తాడని చదివించిన చదువుతో, వాడికి 'బతుకు తెలివి' తప్ప మిగతా 'అతితెలివి' ఎక్కువైంది.

'చదివితే కులవృత్తి చేయగూడదా?... నాగలి పట్ట గూడదా?... కూచొని సంపాయించే ఉద్యోగమెవ డిస్తాడు? పని చేసుకుంటూ బతకడం నామోషీ అయితే ఎలా?... రోజులు మారినాయని చెప్తాడే తప్ప, వాటితో పాటు తనూ మారాలనీ తెలీదా?' అనుకొన్నాడు మల్లేశం.

మల్లేశానికి కొడుకు ఏ విధంగానూ కొరుకుడు పడటంలేదు. గత రెండేళ్లు సింగరేణి కొలువంటూ కొత్తగూడెం కంపెనీ ఆఫీసుల చుట్టూ, యూనియన్ నాయకుల చుట్టూ తిరిగి ఇరవైవేలదాకా పాడుచేశాడు. ఇప్పుడా ఆశ వదులుకొని 'కువైట్' అంటూ కొత్తరాగం ఎత్తుకోవడంతో ఏం చేయడానికీ తోచడంలేదు. 'ఓ యాభైవేలు ఇవ్వండి. ఏడాది తిరక్కుండానే లక్షలు తెస్తా,'నంటూ చిటికలేస్తున్నాడు. కాదు, కూడదంటే ఏడుపులూ, పెడబొబ్బలు, అలగడం, అరవడం. ఇంటిని రావణకాష్టంలా చేస్తున్నాడు.

వాడు తెచ్చే లక్షలేమోగాని, ముందా అరలక్ష ఎలా సర్దాలో మల్లేశానికి దారి దొరకడంలేదు. ఇంకా ముగ్గురాడపిల్లలు. చిన్నోళ్లేగాని రేపోమాపో వాళ్లూ గుండెల మీద కుంపట్లేగద! ఎంత బికారోడ్ని చూసినా అథమం అరలక్ష అడగక మానరనే ఆలోచనల్లో మల్లేశానికి అదో భయం కూడా గుండెల్లో గూడు చేసు కుంటూంది.

మల్లేశం వీధి మూలమలుపు తిరిగి నారందాసు ఇంటి దాపుకొచ్చేసరికి ఎదురింటి ఈతాకుల తులిసెమ్మ నురగతో నిండిన కల్లుబింకీ ఇంట్లోంచి తెచ్చి కల్లు కాలువలో పారబోస్తూ కనిపించింది.

ఆ దృశ్యం అతని గుండెల్లో గుచ్చుకుంది. 'ప్చ్... ఎంతలేదన్నా, చెడమ్ముకున్నా రెండొందలు... ఏం సుఖం, నేలపాలాయె! ఇంకా గవుండ్లోడికి బతుకెక్క డిది?' అనుకుంటూ తులిసెమ్మ దాపుగా వచ్చి, "ఏం తులిసెక్కా కల్లు పులిసిందా, పారబోస్తన్నవ్?" అన్నాడు.

తలెత్తి చూసిన తులిసెమ్మ, "ఎవరూ, మల్లేశవాఁ నీకు తెలవందేవుంద్రా తమ్ముడూ, కల్లు పులిసిపోవడం తప్ప ఖర్చయ్యే రోజులు మాయమయితున్నయి

గదురా... మాయదారి కోకాకోలా తెచ్చి పెట్టిండుగా కోవఁటి నర్సింహ. పదితో తెల్లారిపోతుంటే, పాతిక పెట్టేదెవుడ్రా?'' కల్లుబింకీలో మిగిలిన నురగంతా చేత్తో తీసి పడేస్తూ అంది తులిసెమ్మ.

మల్లేశం తలాడించాడే తప్ప నోరాడించలేదు.

అతనికి మరింత దగ్గరగా వచ్చిన తులిసెమ్మ చిన్న స్వరంతో, ''అవ్‌రా తమ్ముడా... బండోళ్ల ఎంకన్న పెళ్లానికి డబ్బులొచ్చినయటగా?'' అంది అదో రహస్యంలా.

''తెల్వదక్కా''

''నీ మొహం, వచ్చి నాల్రోజుల పైన్నే అయిం దంట... ఖర్చులన్నీ పోను ఎనభయ్యేలు ఇచ్చినంట్ర.''

''ఎన్నిచ్చినా ఎంకన్న బతికొస్తాడాక్కా... దాని ముగ్గురు బిడ్డల్ని సాగనంపడానికి ఆ పోర్ది ఎన్ని శెరలు పడాల్నో...''

''ఇంకేం శెరలురా... మొగుడు లేడనేగాని, దాని బతుక్కు దిగులేం ఉండదు. ఆ డబ్బుల్తోటి పిల్లల్ని సాగనంపుద్ది. వాడుండి సెయ్యలేని పెళ్లిళ్లు, మన్నయి జేస్తండుగాదురా? ఇన్నాళ్లు రాని సంబంధాలు ఇగొస్తయి చూడు. మూతొంకర, ముక్కు పొడుగు అన్నోళ్లే పిల్ల నచ్చిందని ఎంటపడతర్రా. మాయదారి కాలం... ఇయ్యాల్రేపు మనిషున్నా, లేకున్నా డబ్బు... డబ్బుండాల్రా...'' అంది తులిసెమ్మ.

''ఏదో బతకనియ్,'' అంటూ పొద్దుకేసి చూసి, ''పొయ్యొస్తక్కా...'' అంటూ కాలాడించిన మల్లేశానికి మదిలో బండి వెంకన్న కదిలాడు.

బండి వెంకన్న పూటకు పెద్ద ఉన్నోడేం కాక పోయినా మాటకు మనిషనిపించుకొన్నాడు. వయసు చిన్నదయినా వ్యవహారానికి దిట్ట. చురుకుదనం పాలె క్కువ, అందుకని గీత కార్మిక సహకార సంఘం బాధ్యతలూ, అప్పు వాయిదాల వసూళ్లూ అన్నీ అతనికే అప్పగించారు. కుల పంచాయితీల్లో న్యాయం ప్రక్కన తప్ప, ఎదుటి ప్రక్కన ఎంత పోసినా నిలబడే రకం కాదు. అటువంటి వెంకన్న నాలుగునెలల క్రితం పరుపు తాళ్లు అడుగుబట్టి, తాటిమట్టల్లోంచి గెలని బయటకు తీస్తుంటే, మట్టల సందుల్లో చేరిన మండ్రగబ్బ కాటే సింది. వెంకన్న గోసపెడుతూ తాడిమీద నుంచి దొర్లి పడ్డాడు. అదిగో, ఇదిగో అంటుంటేనే ప్రాణం పోయింది. ప్రభుత్వం నుంచి నష్టపరిహారంగా లక్ష రూపాయలు వస్తే రావొచ్చుగాని, తాటివనానికి పోయిన 'గౌడు' ఇంటికి చేరే నమ్మకం లేకుంటే ఇంకెందుకా బతుకు? నష్టపరిహారాల కోసమేనా ఈ వృత్తులు?

ఆలోచనలతో మల్లేశం మనసు చిందరవందరై పోతూంది. చిరాగ్గా ఉంది. గుండె బరువుగా ఉంది. ఊర్పు- నిట్టూర్పుగా మారింది.

తాళ్లవనం దాపుగా వచ్చేసరికి అప్పటికే చెట్లెక్కి ఫలసాయాన్ని చూసుకొంటూ వస్తున్న కొర్ర రాములు, ''మావాఁ... కాలు జాగర్త. కాళ్లగుది గట్టిగ సూసుకో. మంచుకి చెట్టు పూరాగ తడిసింది,'' అన్నాడు.

మల్లేశానికి నవ్వొచ్చింది. కాని నవ్వలేకపోయాడు. చాలారోజులుగా, బహుశా నాలుగయిదు సంవత్స రాలుగా అతనిలో నవ్వు మాయమైంది. ఎంత ప్రయ త్నించినా ఏదో చిన్నపాటి చిరునవ్వే తప్ప గుండెల్లో రక్తం కదిలేలా నవ్వక చాలా కాలమైంది. ''తాతకు దగ్గులు నేర్పుతున్నావురా?...'' అంటూ మరింత దగ్గరగా వచ్చి, ''రేయ్, రామూ, నీ సావాసగాడేగా... మా ఓడికి నువ్వన్నా సెప్పరాదురా... కుయిట్, కుయిట్ అని గోస పెడ తుండు,'' అన్నాడు మల్లేశం.

''అవ్ మావాఁ ఎప్పుడు పొయ్యేది?''

''ఎగసికంగున్నాదిరా... కుయిట్ పోటవంటే మాట్లా... యాభై ఏలు. కావాల్రా... యాడ దొబ్బ కొచ్చేది?''

''డబ్బే కట్టలేదా... మరి మీవోడు నెలాఖర్న యివాఁనం ఎక్కుతనని నిన్న సుత నాతో అన్నడు. వాడు పోవాలగాని నీకు డబ్బులే... డబ్బులు...'' అని పెదాలపై నవ్వాడించాడు రాములు.

''తాలసె... ఎదవ డబ్బు... డబ్బులుండే బతికి నావుఁర ఇంతకాలం?... ఈ మద్దేనొచ్చిందీ డబ్బు రోగం,'' అన్నాడు మల్లేశం.

''ఎనకటి ఊసెందుకులే మావాఁ... ఆ రోజులన్నీ ఇహ కథలే... అప్పటి పలకరింపులూ, రుచులు ఇప్పు డున్నయా?... బుద్దులు పూరాగా మారిపోతున్నయి గద మావాఁ...'' అన్నాడు రాములు.

''అవ్‌రా... పురుగుమందుల పంట తింటన్నం గాదూ?... మనిషికీ పురుగుబుద్దొస్తాంది,'' మల్లేశం అన్నాడు.

''సత్తెం జెప్పినావ్ మావాఁ ఇయ్యాల్రేపూ డబ్బులున్నోడే మనిషి, లేనోడు పురుగుతో జమ.''

''అవ్‌రా రామూ, నాకు తెల్వటంలే... పుట్టిన గడ్డా, కని పెంచిన తలిదండ్రీ లేకుంట యాడనో బతకడం కూడా ఓ బతుకేనార! కలోగంజో తాగి కలిసి

బతకా లని సెప్పిన్రు గాదుర పెద్దోళ్లు. జంతువుల్లాగ ఎవుడికాడు బతకడం, మూటగట్టుగోవడం బతుకెట్ట యిద్దిరా...'' తల గోక్కుంటూ అన్నాడు మల్లేశం.

''పోయినాయ్ మావాఁ... ఆ రోజులన్నీ పోయి నయ్, ఇయ్యాల్రేపు డబ్బులే లోకం. తల్లేగానీ, చెల్లేగానీ డబ్బుతోనే కొలుస్తున్రు... వాడదురుష్టం ఎట్టుందో, ఎట్టనన్నజేసి పంపియ్యి మావాఁ... కాదంటే ఒరిగేదేవన్న ఉందా?'' అన్నాడు రాములు.

''అంతేనంటావా?''

రాములు తలూపుతూ దాటిపోయాడు.

మల్లేశం దాటిపోతున్న రాముల్ని చూస్తూ అలా గనే నిల్చుండిపోయాడు. కొద్దిసేపటికి తెలివొచ్చినట్టు గా, తత్తరపాటుతో 'ఏందీ... ఏందీ మాయ?... ఇంత వయసొచ్చి, నా కొడుకంతోడితో జెప్పించుకొన్న, నా బుద్దేవఁయింది?' అనుకుంటూ తాటిచెట్టు దగ్గరగా చేరాడు.

మల్లేశం మనసు పరిపరివిధాల వెనక్కీ ముందుకీ, కుడికీ ఎడమకీ పరిగెడుతుంది. తన బతుకు లోకి చూసుకొన్నాడు. అప్పులన్నీ నోటికి లెక్కేశాడు. నలభైవేలు లెక్కకొచ్చాయి. రోజులు చూస్తే ఖర్చులు తప్ప రాబడి అరుదైపోయింది. భూమి నిస్సారమై పోతుంది. గాడిద మబ్బులు తప్ప వాన మబ్బులు కరువై పోయాయి. ఇటు జూస్తే నిఖార్సయిన కల్లుకు నూకలు దొరకడంలేదు. దూబగుంట కల్తీ కల్లూ, నల్ల బెల్లం దొంగ గుడుంబా కలిసి గౌండ్ల బతుకుల్ని వెక్కిరి స్తున్నాయి. ఏదో ఒక రాబడి... రాబడి ఉండాలంటే పెట్టుబడి ఉండాల. పెద్దోడ్ని కుయిట్ పంపిస్తేనే కుదిరేలా ఉంది. పోనీ, వాడదురుష్టం ఎలా ఉందో...

అంతలోనే మరో గుబులు... 'తెలీనిచోటుకి పిల్లోడ్ని పంపితే కష్టాల పాలౌతాడేమో! అక్కడేదైనా జరిగితే కబురైనా అందదు. అయినా వాడడిగిన డబ్బు యాడ తెచ్చేది? చెలకమ్ముదామన్నా కొనే వాడెవడు? ఊరిలో డబ్బెవరికుంది?... పోనీ, వడ్డీకి తెచ్చినా రేపు వాడి గీత బావుండక అప్పు మోపెడై యింటిల్లాదులకి ఏ పురుగులమందో గతయిద్దా యేం?' అనుకొన్నాడు.

మళ్లీ అంతలోనే, 'దేశపో... ఎట్టయినా మాబాగె... బతికేందుకు రోజూ సచ్చేదానికన్న అదే సుకం. కానియ్,' అనుకొని మల్లేశం కొడుకును కుయిట్ పంపించాలనే నిర్ణయానికి వచ్చాడు.

ఆలోచనలు- డబ్బు దొరికే దారుల్లో సాగుతూ, తనకు నెలవైన వ్యాపారుల్నీ, ఉద్యోగుల్నీ గుర్తు చేసు కొన్నాడు మల్లేశం. అతని ఆలోచనలకు ఒకరిద్దరు అందినా, అంత డబ్బు ఇవ్వడానికి వెనుకాడతారేమో ననిపించింది.

ఇంతకాలం అడిగి లేదనిపించుకొన్నవాడు కాదు మల్లేశం. మాట తప్పని రైతుగా మంచి పేరుదంతనికి. ఇంతకాలం వ్యవసాయానికి అప్పులిచ్చిన వాళ్లు గత కొన్నేళ్లుగా రైతుల్ని పక్కకు నెట్టేసి, వ్యాపారాలకి మదుపు పెడుతున్నారు. కాదంటే తల కొట్టేసినట్టుందనే ఆలో చనలు అరంభమయ్యాయి. మనసు నిండా టిక్కులూ, రైట్లూ... పిచ్చిగీతలు.. తల వేడెక్కుతుంటే, కులదేవుడు 'కాటమయ్య'ని తల్చుకొంటూ 'సావీఁ... ఈ గండం గట్టెక్కిస్తే పోతుపిల్లనిస్తా... దయజూడు తండ్రీ...' అంటూ రెండు చెంపలు వేసుకొన్నాడు.

తాటిచెట్టు మొగదలలో నిలబడి, కావిడిబద్ద దించి, ఓ ప్రక్కగా ఉంచాడు. లొట్టిని ముస్తాదుకున్న కొక్కానికి తగిలించాడు. కత్తుల్ని చేత్తో తడిమి చూసు కొన్నాడు. పంచెకట్టులో దోపిన చిరతబద్దని తీసి క్రింద పడేసి, మోకందుకొని బుజాల కిందుగా నడుం మీదు గా తాటిచెట్టు చుట్టూ తిప్పి కొక్కెం తగిలించాడు. లాగి చూశాడు. గట్టిగా పట్టుకుంది.

కాళ్లగుది అందుకొని, కుడిపాదానికి తగిలించి చెట్టును తాకి, దండం పెడుతూ చేతి పట్టుతో నాలుగ యిదు బారలు చెట్టెక్కి, కాళ్లగుదిలో ఎడమపాదాన్ని కూడా దూర్చి రెండు పాదాల్ని చెట్టుకు దొప్పలా మోపి, కాళ్ల బిగువుతో మోకును పైకి నెట్టుకుంటూ, ఉబు కుతూ ఎక్కసాగాడు.

సగంచెట్టు ఎక్కేసరికి ఆయాసమనిపించింది. ఎప్పుడూ ఉండేదే... గౌండ్ల బతుకే అంత. చెట్టుచెట్టుకీ, గస పెట్టందే ఫలసాయం చేతికందదు. ప్రతిరోజూ, ప్రతి చెట్టూ, ముప్పొద్దు, మూడుసార్లు ఎక్కి గెలతీసి లొట్టి మార్చాల్సిందే. నాగాబెడితే కుదరదు. కల్లు బారదు. కల్లు బారకపోతే బతుకు గడవదు.

ఆయాసంతోపాటు మల్లేశంలో ఆలోచనలూ సాగుతున్నాయి. వాడు లక్షలు తెస్తనంటున్నాడు... ఈ దెబ్బతోనన్న పిల్లల బతుకులో దారిన పడతయి. ఫలా నోడి పిల్లలు సుకంగున్నారంటే అంతే చాలు...

డబ్బెట్ట... యాభయ్యేలు యాడ దొరుకు తాయ్? అనుకుంటూ మరో నాలుగు బారెలు సాగే సరికి మల్లేశం మనసులో బండి వెంకన్న బుడగేశాడు. 'చస్తేంది, బతికి పీక్కతినేదేవఁన్న ఉండేడిస్తేగా?... పిల్లల్నో దారిజేసిండు అని నలుగురు అనుకుంటే

చాలదా?... ఇయ్యాల గాకుంటే రేపన్న బూడిదగాక తప్పుద్దా?...' అని మనసులోనే అనుకొన్నాడు.

మల్లేశం చెట్టు మొగదదాకా చేరాడు. చెట్టు ఊగింది. రాత్రి కురిసిన మంచు, ఎండపొడకు నీళ్లుగా మారింది. చెట్టు కదిలేసరికి నీళ్ల మట్టల్లోంచి జారి తలపై పడ్డాయి. తల తడిసింది. చల్లదనానికి చెవులు జివ్వుమన్నాయి.

'ఏందో గవుండ్లోడి బతుకు... ఎక్కీ, దిగటవేఁ తప్ప ఎదిగొచ్చినోడెవడూ లేడు. తాళ్ల పాట పాడినోడు తప్ప తాళ్లు గీసివోఁడు బాగయిందీ లేదు. చెట్టు గీసే వోడి కంటే చెట్టు మీంచి పడినోడికే ఇలవ' అనుకుంటూ గెలకు కట్టిన లొట్టి విప్పుతుంటే తల తిరిగినట్టయింది.

చెట్టు ఊగుతున్నట్టుగా ఉంది. భూమి తిరగబడుతున్నట్టుగా ఉంది. చెట్టు పడిపోతున్నట్టుగా, తను గాల్లో తేలిపోతున్నట్టుగా... మొహం నిండా చెమట!... గుండె... గుండెలో... ఎలానో... మంట! తాటి మట్టతో బరబరా కోస్తున్నట్టుగా- గుండెలో బాధ...!

మల్లేశం తెలివి తెచ్చుకునేందుకు ప్రయత్నించాడు. తనకేదో అవుతుందనిపించింది. చెట్టును పట్టుకోవాలనుకొన్నాడు. అందుకు ప్రయత్నం చేసేంతలోనే... అంతలోనే మోకు కిందికి జారింది. కాలు వణికింది. క్షణం గడువకముందే కాళ్ల గుదీ జారిపడింది.

అదే క్షణంలో... కాళ్లగుదితో పాటే, ''పెద్దోడా... కుయిట్... జరభద్రం కొడకో...'' అంటూ హెచ్చరిస్తున్నట్టుగా భీకరంగా కేకేస్తూ- మల్లేశం!

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 23 మార్చి 2003*

